క్లుప్తంగా

రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ


సుబ్రమణ్యం

నందికొట్కూరు: పట్టణంలోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐగా సుబ్రమణ్యం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతటి వారైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

కేరళ వయనాడ్ ప్రజలకు అండగా నిలవాలి


విరాళాలు సేకరిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

ఆత్మకూరు: కేరళ వయనాడ్ వరదల్లో సర్వం కోల్పోయిన ప్రజలకు ప్రతిఒక్కరూ అండగా నిలువాలని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, మండల కార్యదర్శి వీరన్న పిలుపునిచ్చారు. కేరళ వరద బాధితుల కోసం ఎ.సువర్ణమ్మ, విశారద, సులోచన, చంద్రకళ, సువర్ణ తదితరలు సేకరించిన విరాళం రూ.5 వేలను సోమవారం రాజశేఖర్, వీరన్నకు అందజేశారు. వయనాడ్ వరద బీభత్సాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి బాధితులను ఆదుకోవాలని ఈ సందర్భంగా వారు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

సీఐగా బాధ్యతలు స్వీకరించిన చంద్రబాబు



శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట టూటౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జి.చంద్రబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. శిరివెళ్ల సర్కిల్‌లో పనిచేస్తున్న చంద్రబాబును ఉన్నతాధికారులు ఇక్కడికి బదిలీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో పనిచేస్తున్న పోలీసుల వివరాలపై సీఐ ఆరా తీశారు. అదేవిధంగా గ్రామాల పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం డీఎస్పీ రామాంజి నాయక్‌ను కలిసేందుకు ఆత్మకూరుకు వెళ్లారు.

ఎస్‌ఐగా సుబ్బారెడ్డి

సున్నిపెంట టూటౌన్ ఎస్‌ఐగా సుబ్బారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన చిత్తూరుజిల్లా నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం


కేక్ కట్ చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

వెలుగోడు: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. లూయిస్ డ్యాగురే చిత్రపటానికి ఫొటోగ్రాఫర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఫొటోగ్రాఫర్ల యూనియన్ అధ్యక్షుడు రహిమాన్ మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్లకు ఇళ్ల స్థలాలు, సబ్సిడీ రుణాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు రామలింగం, రసూల్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, కష్ణ, లింగస్వామి, తిరుపాలు, శేఖరు,మహమ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.

రైతాంగ వ్యతిరేక విధానాలు తగదు

నంద్యాల(అర్బన్): దేశంలోని రైతులు, వ్యవసాయ రంగాన్ని దోచుకుంటున్న కార్పొరేట్ కంపెనీలు, బడా వ్యాపారులకు కేంద్ర ప్రభుత్వం వత్తాసు పలకం సరికాదని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు అన్నారు. మహానంది మండలం గాజులపల్లెలో కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పనిముట్లు ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తూ కార్పొరేట్ కంపెనీలకు ప్రాధాన్యతను ఇస్తున్నారని మండిపడ్డారు. రైతుల ఆత్మహత్యలను అరికడతానని అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రైతు సంక్షేమానికి మరిచిందన్నారు. కోటకొండ బాషా, మద్దిలేటి, రాజశేఖర్‌నాయక్, ఇమామ్ హుసేన్, కేషాలు, నాగరాజు, నరసింహ పాల్గొన్నారు.

వైభవం..మహానందీశుడి కల్యాణం

నంద్యాల(అర్బన్): మహానందిలో పవిత్ర శ్రావణ పౌర్ణమి, సోమవారం సందర్భంగా శ్రీకామేశ్వరి దేవి సహిత మహానందీశ్వరుల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా కామేశ్వరి అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు, అభిషేకాలు, మహాలక్ష్మీ హోమం జరిపించారు. అనంతరం పాణ్యంకు చెందిన వసంతకుమార్‌శర్మ, పద్మావతి దంపతులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

- శ్రీశైలం దేవస్థానంలో ఫెవికాల్ ఉద్యోగుల తీరు
- ఏళ్లతరబడి తిష్టవేసిన వైనం
- రెండేళ్ల క్రితం అలా బదిలీపై వెళ్లారు... ఇలా వచ్చేశారు?
- వరంగా మారిన డిప్యూటేషన్ అవకాశం

వదలమంటే... వదలం!

శ్రీశైలంటెంపుల్: ప్రసిద్ధ శ్రీశైల పుణ్యక్షేత్రంలో కొందరు సీనియర్ ఉద్యోగులు తమ బరాటా కొనసాగిస్తూనే ఉన్నారు. ఏళ్లతరబడి దేవస్థానంలో తిష్టవేసి చక్రం తిప్పుతున్నారు. ఫెవికాల్ ఉద్యోగులుగా కీర్తి గడించిన వీరు తాము చెప్పిందే వేదం అన్నట్లుగా వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండేళ్ల క్రితం సాధారణ బదిలీలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల సర్వీసు పూర్తయిన ఉద్యోగులను బదిలీ చేసింది. శ్రీశైల దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న సుమారు 40మంది ఉద్యోగులను ఇతర దేవస్థానాలకు బదిలీ చేస్తూ దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఇతర దేవస్థానాలకు బదిలీ అయిన శ్రీశైల దేవస్థాన ఉద్యోగులు తమకు బరాటాను చాటుకున్నారు. రెండుమూడు నెలల్లోనే డిప్యూటేషన్‌పై తిరిగి తమ సొంత దేవస్థానం అన్నట్లుగా శ్రీశైలానికి వచ్చేశారు. డిప్యూటేషన్ ప్రక్రియను అందిపుచ్చుకున్న ఫెవికాల్ ఉద్యోగులు అలా వెళ్లి... ఇలా మళ్లీ శ్రీశైల దేవస్థానం చేరుకున్నారు. శ్రీశైల దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం కార్యనిర్వహణాధికారి, డిప్యూటీ ఈఓ, సహాయ కమిషనర్, సహాయ కార్యనిర్వహణాధికారి రెవెన్యూ, ఆలయం, వసతి విభాగం, గోశాల, క్యూలైన్ పర్యవేక్షణ, శ్రీశైలప్రభ ఎడిటర్, ప్రజాసంబంధాల అధికారి, పలువురు పర్యవేక్షకులు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్, అటెండర్ తదితరులు మొత్తం 245మంది రెగ్యులర్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. అలాగే 1,600మంది కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

రెండేళ్ల క్రితం ఉద్యోగుల బదిలీ

శ్రీశైల దేవస్థానంలో రెండేళ్ల క్రితం ఐదేళ్లు పూర్తయిన ఉద్యోగులను సాధారణ బదిలీలు చేశారు. శ్రీశైల దేవస్థానం నుంచి ఏఈవో, పర్యవేక్షకులు, సీనియర్ అసిస్టెంటు, రికార్డు అసిస్టెంటు తదితరులు సుమారు 40మందికి పైగా ఉద్యోగులు శ్రీకాళహస్తి, మహానంది, కాణిపాకం, కసాపురం తదితర దేవస్థానాలకు బదిలీ అయ్యారు. ఏకంగా 37 మంది ఉద్యోగులు డిప్యూటేషన్‌పై శ్రీశైలానికి తిరగి వచ్చారు. కేవలం నెలల వ్యవధిలో వచ్చిన తీరుపై అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి. అయితే ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం బదిలీ ప్రక్రియ చేపట్టడంలో ఫెవికాల్ ఉద్యోగులు మళ్లీ తమ ఆధిపత్యాన్ని చాటుకునే


శ్రీశైల ఆలయం

పనుల్లో నిమగ్నమయ్యారు. డిప్యూటేషన్ రద్దు కాకుండా తమ పలుకుడిని ప్రయోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికార పార్టీ నాయకులు, రాష్ట్ర స్థాయి అధికారులను ప్రసన్నం చేసుకుని ఇక్కడే తిష్టవేసేందుకు పావులు కదుపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏళ్లతరబడి తిష్టతో అన్నీ అనర్థాలే....

ప్రభుత్వ ఉద్యోగులు ఏళ్లతరబడి తిష్టవేస్తే అన్నీ అనార్థలే జరుగుతాయనే వాదన లేకపోలేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరబడుతుంది. మల్లన్న క్షేత్రంలో గతంలో జరిగిన కుంభకోణం ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. పర్యవేక్షణ కరువై కిందిస్థాయి సిబ్బంది ఇష్టానుసారంగా మల్లన్న సొమ్మును తమ జేబుల్లో నింపుకున్నారు. శ్రీశైల దేవస్థానంలో గతంలో పెట్రోల్ బంక్‌లో, డొనేషన్ కౌంటర్‌లో సుమారు రూ.2.50కోట మేర కుంభకోణం జరిగింది. ఈ కుంభకోణాలపై ఏసీబీ విచారణ జరుగుతుంది. కొంత మంది అధికారులు, సిబ్బందిని రిమాండ్‌కు సైతం తరలించారు. ఇలాంటి ఘటనలు జరుగకుండా ఉండేందుకు ఫెవికాల్ వీరులుగా పేరొందిన ఉద్యోగులను బదిలీ చేయాలని ప్రజా సంఘాల నాయకులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.

అడవిలో పశువులు మేపుకునే అవకాశం కల్పించండి

శ్రీశైలం : శ్రీశైల మహా క్షేత్ర పరిసర ప్రాంతాల్లో ఉన్న అడవుల్లో పశువులు మేపుకోవడానికి అవకాశం కల్పించాలని కోరుతూ మార్కాపూర్ డీఎఫ్‌ఓ విఘ్నేష్‌ను శ్రీశైలం మండల బీజేపీ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ నెల 15న శ్రీశైలం వచ్చిన అటవీ శాఖ జాతీయ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్‌ను గిరిజనులు కలిసి తమ సమస్యలను విన్నవించుకోగా మేకలు, పశువులు శ్రీశైలం పరిసర ప్రాంతాల్లోని అడవుల్లో అవకాశం కల్పించాలని కోరామన్నారు. ఆయన హామీ ఇవ్వడంతో సోమవారం సాయంత్రం మార్కాపూర్ డీఫ్‌ఓకు వినతి పత్రం అందజేశారు. శ్రీశైలం మండల బీజేపీ అధ్యక్షుడు మాయలూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శి బోయ మల్లికార్జున, గిరిజన తండా నాయకులు రాముల నాయక్, శీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఎదుట నిరసన

నందికొట్కూరు: జూనియర్ వైద్యురాలిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని నందికొట్కూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరాముడు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని కోర్టు ఎదుట న్యాయవాదులు నిరసన తెలిపారు. అసోసియేషన్ సభ్యులు నజీర్ అహ్మద్, విజయకుమార్, భాస్కర్, శరబయ్య పాల్గొన్నారు.

తులసీబాయిపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన కొట్టాలచెరువు గిరిజన మహిళలు

ఆత్మకూరు: కొట్టాలచెరువులో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్న తులసీబాయిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన గిరిజన మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం గిరిజన మహిళలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామానికి ప్రభుత్వం చెంచు బారుల వసతిగృహం, అంగన్‌వాడీ కేంద్రం, గ్రంథాలయాన్ని మంజూరు చేసిందని, వాటిని నిర్మించుకునేందుకు గూడెంలో ఎలాంటి ప్రభుత్వ స్థలం లేదని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వానికి చెందిన 8 సెంట్ల స్థలాన్ని తులసీభాయి ఆక్రమించుకుందన్నారు. ఆమె ఆ స్థలం నుంచి ఖాళీ చేయించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్‌తోపాటు స్థానిక పోలీసులు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో గిరిజన మహిళలు ధర్నా విరమించారు.

రసాయనిక ఎరువులకు స్వస్తి చెప్పాలి


కూరగాయల స్టాల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

పగిడ్యాల: ఆరోగ్యానికి హానికరమైన రసాయనిక ఎరువుల వినియోగానికి స్వస్తి పలికి సేంద్రియ ఎరువులు వినియోగించి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల సాగుపై దృష్టి పెట్టాలని తహసీల్దార్ శివరాముడు, వ్యవసాయ అధికారి విజయ్‌జ్యోతుకుమార్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను పరిశీలించారు. రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గిపోతోందని తెలిపారు. పూర్వీకులు సాగు చేసినట్లు సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. రసాయనిక ఎరువులతో పండించిన పంట ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉండదన్నారు. ఆహార ఉత్పత్తులు విషతుల్యంగా మారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, ఆర్‌ఐ శ్రీనువాసులు, ఏపీఓ మద్దిలేటి, ఏపీఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

భ్రమరాంబాదేవికి ఊయల సేవ


ఊయల సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి సోమవారం పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. సాయంత్రం 7గంటలకు సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజల అనంతరం అష్టోరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు.

పల్లకీ ఉత్సవం

శ్రీశైల దేవస్థానంలో సోమవారం స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ పల్లకీ ఉత్సవం ప్రతి ఆదివారం, పౌర్ణమి, మూలా నక్షత్రం రోజులలో (సర్కారీ సేవగా) జరిపించబడుతోంది. ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని జరిపారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో వేంచేబు చేయించి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు.

మహానందీశుడికి పల్లకీ సేవ

నంద్యాల(అర్బన్): మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి శ్రీకామేశ్వరి దేవి సమేత మహానందీశ్వర స్వామికి పల్లకీ సేవను వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయ వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణలు చేయించారు. భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

కల్యాణం.. కమనీయం


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామంలో ఉన్న వీరభద్రస్వామి ఆలయ ఆవరణలో సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఎంఅండ్‌ఈ భాస్కర్ నాయుడు, ఇందిరమ్మ దంపతులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో ప్రత్యేక గ్రామ సభలు

పాములపాడు: మండలంలోని అన్ని పంచాయతీల్లో ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గోపీక్రిష్ణ తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఈ నెల 23న ప్రత్యేక గ్రామ సభలు నిర్వహిస్తామని తెలిపారు. పంచాయతీకి మంజూరైన పనులతో పాటు 2024–25 సంవత్సరానికి సంబంధించిన కొత్త పనులు, సామాజిక తనిఖీ ఆవశ్యకత గురించి ఉపాధి కూలీలకు తెలియజేస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి ఎలాంటి అర్జీలు రాలేదని తెలిపారు. సమావేశంలో ఈఓపీఆర్డీ గంగాధర్, ఏపీఓ విమలమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో భారీ వర్షం

కొత్తపల్లి: మండలంలో సోమవారం భారీ వర్షం కురిసింది. ముసలిమడుగు, గుమ్మడాపురం, ఎర్రమఠం, సింగరాజుపల్లె, శివపురం, లింగాపురం, ఎదురుపాడు, కొక్కెరంచ, దుద్యాల, జడ్డువారిపల్లె, నందికుంట, బావాపురం, గువ్వలకుంట్ల, వీరాపురం, గ్రామాలతో పాటు కొత్తపల్లిలో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. ఆయా గ్రామాల్లో రోడ్లు జలమయం అయ్యాయి. వారం రోజులుగా వేసవిని తలపించిన వాతావరణం వర్షంతో చల్లబడింది. శివపురం గ్రామ సమీపంలో చెట్టు విరిగి రోడ్డుపై పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

గాజులపల్లెలో కుండపోత వర్షం

నంద్యాల(అర్బన్): మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. దాదాపు 2 గంటల పాటు వర్షం కురవడంతో జనజీవనం స్తంభించిపోయింది. వారం రోజులుగా భానుడి ప్రతాపంతో అల్లాడిపోతున్న ప్రజలు వర్షంతో వాతావరణం చల్లబడి ఊరట చెందారు.

పండ్ల తోటలతో మంచి లాభాలు


రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన మొక్కలు

పాములపాడు: పండ్ల తోటల పెంపకంతో రైతులు మంచి లాభాలు సాధించవచ్చని ఏపీఎం విమలమ్మ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద రైతులకు మొక్కలను పంపిణీ చేశారు. ఎంఎస్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద పండ్ల తోటల పెంపకంలో భాగంగా మండలంలోని 11 గ్రామాలకు చెందిన 22 మంది రైతులకు 1840 మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాములపాడు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీగా విధులు నిర్వహించేందుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు. గణితం (జూనియర్) సబ్జెక్టుకు సంబంధించి పీజీలో 50 మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఈ నెల 22న ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో హాజరుకావాలని తెలిపారు. గంటకు రూ.150 చొప్పున నెలకు రూ.10,000 మించకుండా జీతం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 9441510177 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

మహిళలకు రక్షణగా నూతన చట్టాలు అమలు చేయాలి

ఆత్మకూరు: మహిళలపై జరుగుతున్న హత్యాచారాలను అరికట్టాలని, వారికి రక్షణగా నూతన చట్టాలు అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కె.దినేష్కుమార్, అధ్యక్ష, కార్యదర్శులు సాయి, ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రక్షాబంధన్ సందర్భంగా డీఎస్పీ రామాంజినాయక్‌కు విద్యార్థినులు రాఖీ కట్టారు. అనంతరం ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకు మహిళలపై యాసిడ్ దాడులు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అంజి, బాబు, దిలీప్, హరి, సాంబశివుడు, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

నందికొట్కూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మెనూ ప్రకారం బలమైన ఆహారం అందించాలని ఎమ్మెల్యే జయసూర్య ఆదేశించారు. సోమవారం నందికొట్టూరు బైరెడ్డి నగర్‌లోని 15వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే తనిఖీ చేశారు. పిల్లలతో కొద్దిసేపు ముచ్చటించారు. మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల ఎదుగుదలకు ప్రభుత్వం అందించే బలమైన ఆహారం సంపూర్ణంగా అందించాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడంతో చిన్నారులకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. ఈయన వెంట కౌన్సిలరు కృష్ణవేణి, టీడీపీ నాయకులు ఉన్నారు.

అమ్మవారికి లక్ష కుంకుమార్చన

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా సోమవారం అమ్మవారికి లక్ష కుంకుమార్చన జరిపించారు. లక్ష కుంకుమార్చనలో భక్తులు పరోక్షసేవగా పాల్గొనే అవకాశాన్ని కూడా అధికారులు కల్పించారు. మొత్తం 30 మంది భక్తులు పరోక్షసేవగా ఈ కుంకుమార్చనను జరిపించుకున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ తదితర ప్రాంతాల నుంచి ఈ పూజలను నిర్వహించుకున్నారు. ముందుగా పూజాసంకల్పం పఠించారు. మహాగణపతి పూజను నిర్వహించిన అనంతరం లక్షకుంకుమార్చన జరిపించారు. శ్రీశైలక్షేత్రానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు వారి గోత్రనామాలతో ఆయా ఆర్జిత సేవలను పరోక్షంగా జరిపించుకునేందుకు వీలుగా దేవస్థానం ఈ పరోక్షసేవలను నిర్వహిస్తోంది.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

వెలుగోడు: వెలుగోడు మండలంలో సోమవారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. రాఖీ పౌర్ణమినీ పురస్కరించుకొని అన్నా చెల్లెలు, అక్క తమ్ముళ్లు బంధానికి ప్రతీక రక్షాబంధన్ వేడుకలని పలువురు పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలలో సోదరీమణులు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

కొత్తపల్లి: కోల్‌కతాలోని ఆర్‌జీకార్ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ స్వాములు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు దినేష్, సంపత్, రాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆమె ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కొత్తపల్లి అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

రేపటి బంద్‌ను జయప్రదం చేద్దాం

నందికొట్కూరు: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా ఈ నెల 21వ తేదీ (బుధవారం) తలపెట్టిన భారత్ బంద్‌కు అందరూ సహరించాలని మాలమహానాడు తాలుకా అధ్యక్షుడు నగేష్ కోరారు. సోమవారం పట్టణంలోని మాలమహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వానికి మాలల సత్తా ఏమిటో చూపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. భారత్ బంద్‌కు ప్రైవేట్ విద్యాసంస్థలు, దుకాణ యజమానులు, రవాణ సంస్థల నిర్వాహకులు, ఆటో, ట్యాక్సీ యూనియన్, హోటల్స్ యాజమానులు సహకరించాలని కోరారు.

రాయితీపై ఆవులు, జీవాలకు ఇన్సూరెన్స్


వివరాలు వెల్లడిస్తున్న ఏడీ రామాంజనేయ నాయక్

జూపాడుబంగ్లా: ఆవులు, బర్రెలు, జీవాలు(గొర్రెలు, పొట్టేళ్లు, మేకలు, పందులు)లకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామాంజనేయ నాయక్ తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆవులు, బర్రెలు, జీవాలకు ఇన్సూరెన్స్ పథకం తీసుకొచ్చిందని చెప్పారు. ఈ పథకం ప్రకారం ఎస్సీ, ఎస్టీ, తెల్లరేషన్‌కార్డు కలిగిన వారికి లబ్ధిదారుని వాటాగా 20 శాతం, కార్డు లేని లబ్ధిదారుని వాటా 50 శాతంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఆవులు, గేదెలకు మూడేళ్ల కాలపరిమితికి రూ.30 వేల ఇన్సూరెన్స్ కోసం ఎస్సీ, ఎస్టీ, తెల్లరేషన్‌కార్డు కలిగిన వారు (ఒక్కో ఆవు, బర్రెకు) రూ.384 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ధనికులైన వారు రూ.960 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.15 వేల ఇన్సూరెన్స్ కోసం ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ వారు రూ.192, ఏపీఎల్ వారు రూ.480 చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. గొర్రెలు, మేకలు, పందులకు రూ.6 వేల ఇన్సూరెన్స్ కోసం ఏడాదికి ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ వారు(ఒక్కో దానికి) రూ.36, ఏపీఎల్ వారు రూ.90 చెల్లించాల్సి ఉంటుంది. రూ.6వేల ఇన్సూరెన్స్ రెండేళ్ల కాలపరిమితికి ఎస్సీ,ఎస్టీ, బీపీఎల్ రూ.54, ఏపీఎల్ రూ.135, మూడేళ్ల కాలపరిమితికి ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ రూ.75, ఏపీఎల్ రూ.187.50 చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఈ అవకాశాన్ని ఆవులు, బర్రెలు, జీవాల పోషకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

శ్రీశైలం : మహిళా చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సీఐ ప్రసాదరావు సూచించారు. రక్షాబంధన్ సందర్భంగా సోమవారం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో హెచ్ఎం వెంకటరమణ అధ్యక్షతన 'మహిళల ఆత్మ రక్షణ, విద్యార్థిను అప్రమత్తత' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన సీఐ ప్రసాదరావు మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినుల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని, వాటిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మహిళల రక్షణ, ప్రత్యేక చట్టాలు, సైబర్ సెక్యూరిటీ సిస్టమ్, ఈవ్ టీజింగ్ తదితర విషయాలపై చర్చించుకోవాలన్నారు. ఏ ఆపదవచ్చినా పోలీసులకు ఫోన్ చేస్తే నిమిషాల్లో మీ ముందు ఉంటారని, సాంకేతికతను మహిళలు, విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వన్ టౌన్ పోలీసులు శివ మహేందర్ రెడ్డి, నాగమణి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన గొర్రెల కాపర్లను ఆదుకోవాలి


గొర్రెల కాపర్లతో మాట్లాడుతున్న కురువ సంఘం నాయకులు


జూపాడుబంగ్లా: ఈనెల 17న పారుమంచాల గ్రామంలో 20 గొర్రెలు మృత్యువాత పడడంతో నష్టపోయిన గొర్రెల కాపర్లకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రంగస్వామి డిమాండ్ చేశారు. సోమవారం పారుమంచాల గ్రామానికి చెందిన గొర్రెల కాపరులను కలిసి వివరాలు తెలుకున్నారు. గ్రామానికి చెందిన కురువ శ్రీనివాసులు, కురువ కృష్ణ, కురువ మల్లయ్య, లింగన్నలు గొర్రెలను మోపేందుకు పొలాల్లోకి వెళ్లారు. బుడమాకు తిని జీవాలు మృత్యువాత పడినట్లు తెలిపారు. దీంతో గొర్రెల కాపర్లకు రూ.3 లక్షల నష్టం వాటిల్లినట్లు చెప్పారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. ఉచితంగా ఇన్సురెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. కురువ సంఘం నాయకులు అల్లూరు వెంకటేశ్వర్లు, అల్లబాబు, కురువ మహేష్, రామయ్య, రాముడు పాల్గొన్నారు.

ఎస్సార్‌బీసీ కాలువలోకి దూకి ఆత్మహత్యాయత్నం


కృష్ణమూర్తి

మిడుతూరు: మండల పరిధిలోని తలముడిపి గ్రామానికి చెందిన యువకుడు గడివేముల మండలం మంచాలకట్ట సమీపంలోని ఎస్సార్‌బీసీ కాలువలో దూకి సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామస్తుల వివరాల మేరకు.. మిడుతూరు మండలం తలముడిపి గ్రామానికి చెందిన ఉప్పరి ఓబులేసు కుమారుడు ఉప్పరి కృష్ణమూర్తి సాయంత్రం సమయంలో తలముడిపి గ్రామం నుంచి నడుచుకుంటూ మంచాలకట్ట సమీపంలోని ఎస్సార్‌బీసీ కాలువ దగ్గరకు వెళ్లాడు. కాలువ పక్కన పంచ వదిలి కాలువలో దూకాడు. కొందరు గమనించి కాలువ దగ్గరకు వెళ్లే సరికి నీటి ప్రవాహానికి కొట్టుకుని పోతున్నాడు. కొంత దూరంలో వేప చెట్టును పట్టుకుని వేలాడుతున్నాడు. తాళ్ల సహాయంతో రక్షించాలని వెళ్లగా ఆ యువకుడు కాలువలో కనిపించలేదు. కాలువ వెంట గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

ఉద్యానవన పంటలతో అధిక లాభాలు


రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న అధికారులు

కొత్తపల్లి: ఉద్యానవన పంటలతో రైతుల ఆర్థికాభివృద్ధి సాధ్యం అవుతుందని ఎంపీడీఓ దాసరి మేరీ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయం వద్ద రైతులకు మొక్కలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. ఉద్యానవన పంటల సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. అందులో భాగంగానే ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు. మండలంలో 30 మంది రైతులకు 47 ఎకరాలకు చీని, మామిడి, జామ, సపోట, దానిమ్మ, కొబ్బరి, నేరేడు మొక్కలను పంపిణీ చేశామన్నారు. మొత్తం 5,600 మొక్కలను రైతులకు ఇచ్చామన్నారు. ఐటీడీఏ ఏపీఓ రేష్మ, ఐటీడీఏ ఏపీఓ రాజునాయక్, రైతులు పాల్గొన్నారు.